క్లుప్తంగా

హైందవ శంఖారావానికి తరలిన ప్రజలు


హైందవ శంఖారావానికి వెళుతున్న మండల ప్రజలు

కురిచేడు: విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు బయలుదేరి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు సుమారు వందమంది స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లారు. శంఖారావం నిర్వాహకులు ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. నిర్వాహకులు వెళ్లినవారికి ఇబ్బందులు కలగకుండా టిఫిన్, భోజన ఏర్పాట్లు చేశారు.

మూడు మట్టి టిప్పర్‌లు స్వాధీనం


రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్‌లు

దర్శి: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలకు దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ రూ.30వేలు జరిమానా విధించారు. ఆదివారం మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వీఆర్వో ద్వారా తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా తరలిస్తున్న మట్టి టిప్పర్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని చెప్పారు. పలుమార్లు పట్టు బడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

హిందువులు ఐకమత్యంతో మెలగాలి

గిద్దలూరు రూరల్: హిందువులు ఐకమత్యంతో మెలగాలని ఆర్.ఎస్.ఎస్. ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి, బీజేపీ నేతల పిడతల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆదివారం తెల్లవారుజామున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువుల అలసత్వం కారణంగా ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పిడతల సరస్వతి, విశ్వ హిందూ పరిషత్ నాయకులు బూజుమేకల రాజు, యర్రారెడ్డి, రామిరెడ్డి, కె.నరసింహులు, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. బీజేపీ నేతలు కిలారి శ్రీనివాసరావు, కేవీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో జై శ్రీరామ్ అంటూ హిందూ శంఖారావం సభకు బయలుదేరారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మదార్‌వలి(55) అనారోగ్యం కారణంగా ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వీఆర్‌ఏ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మదార్‌వలి అంత్యక్రియలకుగాను ప్రభుత్వం తరపున రూ.15 వేలు అందజేశారు. ఆర్‌ఐ భాస్కర్, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, అరిగెల వెంకటరామయ్య, సిబ్బంది సంజీవ్ తదితరులు నివాళులర్పించారు.

15 మంది వాహనదారులకు జరిమానా

మార్కాపురం: హెల్మెట్ వాడకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత రెండు రోజుల్లో సుమారు 50 మందికిపైగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించి జరిమానా వేశారు. ఆదివారం ట్రాఫిక్ ఎస్సై అహరోన్, టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేని 15 మందిపై జరిమానా విధించడంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అహరోన్ తెలిపారు.

పట్టణ ముత్తవల్లి సంఘం ఎన్నిక

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ ముత్తవల్లిలా సంఘం అధ్యక్షుడిగా జామియా మజీద్ ముతవల్లి మీర్జా సఫ్దర్ అలీ బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం తెలిపారు. అలాగే కార్యదర్శిగా మదీనా మజీద్ ముత్తవల్లి షేక్ కరీముల్లా, సహాయ కార్యదర్శిగా ఆటో నగర్ మసీద్ ముత్తవల్లి షేక్ బాషా, అన్సార్ మజీద్ ముత్తవల్లి షేక్ బాషా, అన్సార్ మసీద్ ముత్తవల్లి మొహమ్మద్, ఉపాధ్యక్షులుగా ఇస్లాంపేట మక్కా మసీద్ ముత్తవల్లిలు షేక్ మున్నా, మహబూబ్ పీరా, కోశాధికారిగా ఇందిరమ్మ కాలనీ మసీద్ ముత్తవల్లి షేక్ షఫీ, గౌరవ అధ్యక్షుడిగా చిన్న మసీద్ ముత్తవల్లి అబ్దుల్ రజాక్, గౌరవ సలహాదారులుగా మీనా మసీద్, కౌసర్ మజీద్‌ల ముత్తవల్లిలు షేక్ షఫీ ఉల్లా, పల్నాటి రెహమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని పట్టణంలోని ముస్లిం సోదరులు, మైనార్టీ నాయకులు, వివిధ మసీద్‌ల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం


శాఖా గ్రంథాలయం వద్ద తాగునీటి పైపు పగిలి వృథాగా పోతున్న తాగునీరు


తారురోడ్డుపై చెరువులా నిలిచిన వృథా నీరు

- పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు
- కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుల ఆవేదన


పెద్దారవీడు:

అధికారుల నిర్లక్ష్యం గ్రామస్తులకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రమైన పెద్దారవీడులో ట్యాంక్ నుంచి పైపుల ద్వారా వచ్చే కలుషిత నీరే తాగుతున్నామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో శివాలయం దగ్గర నీళ్ల ట్యాంక్ నుంచి పైపుల ద్వారా తూర్పుపల్లె బజారుకు రోజు మార్చి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మార్గమధ్యంలో శాఖా గ్రంథాలయం వద్ద తాగునీటి పైపు పగిలి పోవడంతో నీరంతా వృథాగా పోతుంది. నీటిని వదిలిన రోజు మాత్రం తాగునీరు ఎక్కువగా వృథాగా పోతూనే ఉన్నాయి. రంగుమారి దుర్వాసన వెదజల్లుతున్న తాగునీటి సమస్యను పంచాయతీ, మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

వృథా నీటిని అరికట్టేదెప్పుడు..?

ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పైప్‌లైన్ లీకై వృథా నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో చెరువును తలపిస్తున్నాయి. రోడ్డుపై నిలిచి ఉన్న నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు రోజుల కొద్ది నిల్వ ఉన్న నీటిలో దోమలకు అవాస కేంద్రాలుగా మారాయి. నీరు నిల్వ ఉన్న ప్రాంతం బస్టాండ్ కావడంతో బస్సుల కోసం ప్రజలు వేచి ఉండాలంటే మురుగు నీటి దుర్వాసనకు ముక్కు మూసుకుని ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న ప్రయాణికుల దుస్తులపై బురదనీళ్లు పడుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి పగిలిన పైపులు తొలగించి కొత్త పైపులను ఏర్పాటు చేసి తాగునీరు వృథాగా రోడ్డు పైకి పోకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టండి



గ్రంథాలయం వద్ద తాగునీటి పైపు పగిలిపోవడంతో నీరంతా రోడ్డు పాలవతున్నాయి. కలుషిత నీరు తాగాలంటే రోగాల బారిన పడతామోనని భయంగా ఉంది. తారురోడ్డుపై వృథా నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిగా ఉంది. బస్టాండ్ దగ్గర నీరు ఉండడంతో బస్సులు దూరంగా అపుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టి మంచి నీటిని సరఫరా చేయాలి.

ఆన్నపురెడ్డి వెంకటరెడ్డి, పెద్దారవీడు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పెద్దారవీడులో ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ దేవత


గుంటిగంగ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామ సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామ సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ఘనంగా గంగాభవాని అమ్మవారికి పూజలు

తాళ్లూరు: మండలంలో గంగవరం పంచాయతీ సోమవర్పాడు గ్రామం పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రంలో వేంచేసిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వరశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మల్లికార్జునస్వామి, నాగమ్మతల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కె. గురుబ్రహ్మం, ఈఓ గుంటపల్లి వాసు పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉండండి

- వైఎస్సార్ సీపీ నేతలకు సజ్జల సూచన


సజ్జలను సన్మానిస్తున్న షంషేర్, బద్రీనాథ్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు. సజ్జలను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా బద్రీ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయిలో బలోపేతలం చేయాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించినట్లు వారు తెలిపారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో కొలువై ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారికి ఆదివారం మహిళా భక్తులు సారె సమర్పించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి దేవస్థాన కమిటీ సభ్యులు, ఆండాళ్ గోష్ఠి మహిళా కమిటీ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మేళ తాళాల నడుమ అంగరంగ వైభవంగా సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు అరుణ్‌కుమార్ భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టి వెంకటేశ్వర్లు, సెక్రటరీ నిట్టూరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూలతోట కాదు.. పొగాకు పంట


కవలకుంటలో సాగు చేసిన పొగాకు పంట

పుల్లలచెరువు: పుల్లలచెరువు నుంచి యర్రగొండపాలెం వెళ్లే రహదారిలో రైతులు సాగు చేసిన పొగాకు పంట పొలాలు పూల తోటలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో వేల ఎకరాల్లో రైతులు పొగాకు పంటను సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో సాగు చేసిన పొగాకు పంట పూత దశకు చేరుకుంది. మొక్కల నిండా పూలు కాయడంతో చూపులకు పూల తోటలా అన్నట్లుగా కనువిందు చేస్తున్నాయి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎన్‌వీ సుబ్బారెడ్డి

దర్శి: కలిసి కట్టుగా పని చేసి ఉద్యోగుల సమస్యలపై పరిష్కార మార్గం ఎంచుకుందామని దర్శి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. దర్శి పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగులతో వార్షిక యూనియన్ సమావేశం కార్యదర్శి బి. మస్తాన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఎన్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారంపై ప్రణాళిక ఏర్పాటు చేసుకుని కలిసి కట్టుగా సాధించుకుందామన్నారు. దర్శిలో సంఘం భవనం ఏర్పాటుపై చర్చించారు. డైరీ, కేలండర్‌ల ఏర్పాటు గురించి చర్చించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న షెక్షావలి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలోని బేస్త వీధికి చెందిన రాతం పాలంకయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మండల కేంద్రంలో దినసరి కూలీగా కుటుంబాన్ని పోషించుకునే పాలంకయ్య మృతితో ఆ కుటుంబం శోక సముద్రం మునిగి పోయింది. పాలంకయ్య మృతి వార్త విన్న సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి మృతుని కుటుంబసభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల రూపాయల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు రాజు, సుభాని, కాశి ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దొనకొండ: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులంతా ఒకరికొకరు ఆత్మీయ అనుభవాలు పంచుకున్నారు. చిన్ననాటి చేష్టలను గుర్తు తెచ్చుకున్నారు. అప్పటి మారు పేర్లతో ఒకరి నొకరు పిలుచుకుంటూ నాటి సంగతులు చేసిన చిలిపి పనులన్నీ గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తులను, కుటుంబ విషయాలు, పిల్లల చదువుల గురించి చర్చించుకున్నారు. శారీరకంగా, ఆర్థికంగా మార్పులు జరిగినా స్నేహం మాత్రం మారలేదని ఒకరినొకరు వారి అభిప్రాయాలు పంచుకుంటూ ఆనంద భాష్పాలు కళ్ళల్లో నింపుకున్నారు. ఆనాటి గురువులు కె.బాలరాజు, కె.విలాసినిని ఆహ్వానించి సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలకు ఏదో చేయాలనే సంకల్పం వారిలో చేకూరింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు విద్యార్థులకు డైనింగ్ హాల్ అవసరమని చెప్పడంతో వారు లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. అందులో యం.రమణయ్య అనే పూర్వ విద్యార్థి రూ.25 వేలు తమ వంతు కేటాయించారు. దాతృత్వం ఉన్న పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. పూర్వ విద్యార్థి జి.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా సహపంక్తి భోజనాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పొలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో అర్చకుడు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మాదిగ ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ


కేలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

దర్శి: నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగుల సంఘం కేలండర్‌ను ఎంఈఎఫ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు తాళ్లూరి ఆల్‌ఫ్రెడ్ బహుజన రచయితల సంఘం అధ్యక్షుడు అట్లూరి రామారావు చేతుల మీదుగా దర్శిలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉపాధ్యాయులు, జి. రాజశేఖర్, రిటైర్డ్ ఎస్సై దారి వేములు ఎలీషా, నవ్యంధ్ర చర్మ,డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు గోవింద్ ప్రసాద్, నేరెళ్ళ జాన్, నూనె హనోకు, జెస్సీ పాల్, జానకీట్స్, సుబ్బయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు


ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పొదిలి రూరల్: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం పొదిలి మండలంలోని ఈగలపాడులో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈగలపాడులో 365 గృహాలను సర్వే చేయగా 9 మందికి జ్వరం, కీళ్ల నొప్పులు ఉన్నట్లు తేలిందని చెప్పారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి ఒంగోలు జీజీహెచ్ ల్యాబ్‌కు పంపాలని, నీటి పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. దోమల వ్యాప్తిని నివారించడానికి ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రావణకుమార్, ఏఎంఓ పి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణకుమార్, చందలూరు పీహెచ్‌సీ డాక్టర్ బ్లెస్సీ, డాక్టర్ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.కృష్ణ, ఎస్.బసవరెడ్డి, హెచ్‌వీ మెరీనా, ఏఎన్‌ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు చినారికట్ల విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి వైద్య, విజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని చినారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎంపికైందని హెచ్‌ఎం బి.కోటిరెడ్డి తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు ఎం.నాగసాయి, బి.వీరేంద్ర రూపొందించిన మానవీయ కంచె(ఫెన్సింగ్ ఆఫ్ హ్యుమానిటీ) ప్రాజెక్ట్ ఎంపికైందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో అడవి పందులు, కోతులు, ఇతర జంతువులు ప్రవేశించకుండా విద్యుత్ కంచె వాడటం ప్రమాదకరమన్నారు. ఈ నేపథ్యంలో అటు అడవి జంతువులు, ఇటు మనుషులకు ప్రాణ హాని లేకుండా 9 వోల్టుల బ్యాటరీ, సోలార్ ప్యానల్ ఉపయోగించి ఫెన్సింగ్ రూపొందించినట్లు వివరించారు. జంతువులు కానీ, మనుషులు కానీ కంచెను తాకినప్పుడు చిన్నపాటి బజర్ మోగి, శరీరం జిల్ అంటుందని తద్వారా జంతువులు భయపడి పారిపోతాయన్నారు. రైతులు ఈ కంచె ఏర్పాటు చేసుకోవడం ద్వారా రాత్రి పూట పొలాలకు కాపలా వెళ్లకుండా ఉండవచ్చన్నరు. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఐజాక్ గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి డీఈఓ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థులకు ప్రోత్సాహకంగా తెలుగు ఉపాధ్యాయుడు రామారావు రూ.2 వేలు అందజేసి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.